

రూ.10.27 కోట్లతో ప్రగతి

కె.కోటపాడు మండలంలో పది గ్రామాల్లో రూ.10.27 కోట్లతో చేపట్టిన ప్రగతి పనులను గురువారం ప్రారంభించనున్నారు. 8లో



విశేష ఏర్పాట్లు

విశాఖ: మార్గశిర మాసం ఆఖరి గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం విశేష ఏర్పాట్లు చేస్తున్నారు.



వైభవంగా దీపారాధన

విశాఖ: లలితానగర్ లలిత పీఠంలోని శ్రీరంగనాథస్వామి, గోదాదేవి సన్నిధిలో ధనుర్మాస దీపార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

కశింకోటలో వడ్డాది పాపయ్య, గురునాథరావు విగ్రహాలు



విగ్రహాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట: కశింకోటలోని ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద జాతీయ రహదారి పక్కన మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు, ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య విగ్రహాలను నెలకొల్పడానికి చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విగ్రహాలు నెలకొల్పనున్న ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కశింకోట గ్రామవాసులైన వడ్డాది పాపయ్య అద్భుతమైన చిత్రకారుడని, ప్రాచీన సాహిత్యాన్ని ఆకళింపు చేసుకొని తన కుంచెకు సాహితీ సౌరభాన్ని అద్ది చిత్రాలను రూపొందించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా, అనకాపల్లి ఎంపీగా తన తండ్రి గురునాథరావు ఎన్నో సేవలందించారని, వారిద్దరి విగ్రహాలను ఏర్పాటు చేయడం తన అదృష్టమన్నారు. ఇన్‌లాండ్ వాటర్‌వేస్ సంస్థ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఐఎస్‌వో బృందం తనిఖీలు



కంప్యూటర్‌లో నివేదికల్ని పరిశీలిస్తున్న అధికారులు

అచ్యుతాపురం: చెన్నైకి చెందిన ఐఎస్‌వో సర్టిఫికేట్ నిర్ధారణ బృందం అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ బృందం ఐఎస్‌వో సర్టిఫికెట్‌కు సంబంధించిన (ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్) ప్రక్రియను పరిశీలించినట్లు సమాచారం. ఈ బృందంలో అధికారి అనిత తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా బూరె బాబూరావు



దేవరాపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర మోనిటరింగ్ కౌన్సిల్ సభ్యునిగా దేవరాపల్లి మండలంలోని బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబూరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 28న జీవో ఎంఎస్ నెంబర్ 102ను జారీ చేసింది. కేటగిరీ-1, కేటగిరి-2, కేటగిరి-3 విభాగాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 9 మందిని నియమించారు. కేటగిరి-1లో నాన్ అఫీషియల్స్ నుంచి జిల్లాలో బాబురావుకు చోటు లభించింది. ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసి మరింత సమర్థవంతంగా పథకం అమలు చేసేలా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందిస్తారు.

నేడు ఫిషింగ్ హార్బర్‌లో 10వ సాగర పరిక్రమ కార్యక్రమం

- కేంద్ర, రాష్ట్ర మంత్రుల రాక

మహారాణిపేట: రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఫిషింగ్ హార్బర్‌లో 10వ సాగర పరిక్రమ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కేంద్ర మత్స్యశాఖ మంత్రులు పరుషోత్తం రూపాల, ఎల్.మురుగన్, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

పింఛన్ల పండగ



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

గ్రామాల్లో ఒంటరి మహిళలకు కాసింత భరోసా పింఛన్. చాలా చోట్ల వృద్ధులకు వారి కుటుంబంలో అంతో ఇంతో ఆదరణ దొరుకుతుందంటే అది పింఛన్ వల్లేనంటే అతిశయోక్తి కాదు. గత ప్రభుత్వంలో ఇచ్చే అరకొర పింఛన్ దేనికీ సరిపోని పరిస్థితి. కొత్తగా పింఛన్ కావాలంటే లబ్ధిదారుల్లో ఎవరైనా చనిపోతే తప్ప, వచ్చేది కాదు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ తిప్పల్లేవు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేలకు పింఛన్ పెంచారు. కొత్త పింఛన్లను కూడా మంజూరు చేశారు. పెంచిన పింఛన్‌తోపాటు, కొత్త పింఛన్ల పంపిణీని బుధవారం ప్రారంభించారు.

- పింఛన్‌దారులకు సంక్రాంతి కానుక రూ.3 వేలు పింఛన్
- జనవరి నెల పింఛన్ల లబ్ధి రూ.77.90 కోట్లు
- ఈ ఏడాది జిల్లాలో కొత్త పింఛన్లు 2,949

తుమ్మపాల: వృద్ధులు, ఒంటరి మహిళలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పింఛన్ భరోసా మరింత పెరిగింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ నెల నుంచి రూ.3 వేలు చొప్పున పింఛన్ అందిస్తున్నారు. దీంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన లబ్ధిదారులకు పింఛన్ పెంపు వరంలా మారింది. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే అందించడం వృద్ధులకు, రోగులకు మరింత ఆనందాన్నిస్తోంది.

జిల్లాలో 2.68 లక్షల పింఛన్‌దారులు

వృద్ధులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, సంప్రదాయ చెప్పులు కుట్టేవారు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లు, డప్పు కళాకారులు తదితర కేటగిరీలో జిల్లాలో 2,64,702 మంది పింఛన్ లబ్ధిదారులున్నారు. ఈ నెల కొత్త పింఛన్లు 2,949 మందికి మంజూరయ్యాయి. దీంతో పింఛన్ లబ్ధిదారుల సంఖ్య జిల్లాలో 2,67,651 మందికి చేరుకుంది. వీరిలో రూ.500 పింఛన్ అందుకుంటున్న అభయహస్తం లబ్ధిదారులు, రూ.10 వేలు అందుకుంటున్న డయాలసిస్ రోగులూ ఉన్నారు.

ఇప్పటి వరకు రూ.2,750 చొప్పున అందుకుంటున్న లబ్ధిదారులకు ఈ నెల నుంచి రూ.3 వేలు చొప్పున పింఛన్ లబ్ధిని ప్రభుత్వం పెంచింది. దీంతో ఈ నెల జిల్లాలో రూ.77.91 కోట్ల నిధులు పింఛన్ల పంపిణీకి విడుదల చేశారు. ఇందులో కొత్త పింఛన్ల వ్యయమే రూ.88.47 లక్షలు.

నియోజకవర్గాల వారీగా పింఛన్‌దారులు

నియోజకవర్గం	కొత్త పింఛన్లు	పాత పింఛన్లు
అనకాపల్లి	504	33,610
చోడవరం	532	45,750
మాడుగుల	273	42,149
నర్సీపట్నం	519	42,974
పాయకరావుపేట	439	47,391
యలమంచిలి	458	37,932
పెందుర్తి	224	14,896
మొత్తం	2,949	2,64,702

జిల్లాలో 2,67,651 మందికి పింఛన్ కానుక

- పంపిణీ ప్రారంభించిన కలెక్టర్, ప్రభుత్వ విప్

తుమ్మపాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల వంతున ప్రభుత్వం సామాజిక పింఛన్లు అందిస్తోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కాకినాడ నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, లబ్ధిదారులతో కలిసి ఆయన వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ల సొమ్మును చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది పెంచిన రూ.250తో కలిపి రూ.3 వేలను 2 లక్షల 67 వేల 651 మంది లబ్ధిదారులకు అందజేస్తున్నామని, మొత్తం రూ.77 కోట్ల 90 లక్షల 94 వేలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. వీటిలో వృద్ధాప్య పెన్షన్లు లక్షా 40 వేల 633, వితంతు పింఛన్లు 64,891, దివ్యాంగులు 31,461, చేనేత కార్మికులు 2,557, అభయ హస్తం 12,099, మత్స్యకారులు 3,411, ఒంటరి స్త్రీ 5,830, కల్లుగీత పనివారు 2,469, ట్రాన్స్‌జెండర్స్ 23, డప్పు కళాకారుల పింఛన్లు 1320 ఉన్నాయన్నారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా రూ.250 చొప్పున క్రమంగా రూ.3 వేల వరకు పెంచుకుంటూ పోతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని, అవ్వా తాతలు, అక్క చెల్లెమ్మలు, అన్నదమ్ములకు బాసటగా నిలిచారన్నారు. డీఆర్డీఏ పీడీ శచీదేవి, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేకాధికారి మంజులవాణి, సీపీవో జి.రామారావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాట తప్పని.. మడమ తిప్పని నేత



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, సమన్వయకర్త మలసాల

అనకాపల్లి: ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచి మాట తప్పని.. మడమ తిప్పని నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో తుమ్మపాల బంగార్రాజు కల్యాణ మండప ఆవరణలో ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీ బీవీ సత్యవతితో కలిసి దివంగత సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఏడాది రూ.250 పెంచుతూ ఈనెల నుంచి రూ.3 వేలు అందిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షల మందికి నెలకు రూ.456 కోట్ల పింఛన్లు అందజేస్తే, మనందరి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 66లక్షల మందికి నెలకు రూ.1950 కోట్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడారు. అంతకుముందు పెంచిన కొత్త పింఛన్లను మంత్రి, ఎంపీ లబ్ధిదారులకు అందజేసి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వృద్ధాప్య పింఛన్ అందుకున్న రాజేశ్వరి మాట్లాడుతూ సుమారు 4 సంవత్సరాల నుంచి పింఛను తీసుకుంటున్నానని, 2024లో పెద్దకొడుకు జగన్‌మోహన్‌రెడ్డిని వృద్ధులందరూ కలిసి గెలిపించుకున్నట్లయితే పెన్షన్ మరింత పెంచుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎంపీడీవో కె.నర్సింహారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ (జోసెఫ్), గ్రామ సర్పంచ్ తట్టాపెంటయ్య నాయుడు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి, కశింకోట పట్టణ, మండల అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు, పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జిల్లా గ్రీవెన్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

తొలిసారిగా అందుకున్నాను



నా భర్త ఆరు మాసాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. మొదటిసారిగా పెన్షన్ అందుకున్నాను. పెరిగిన పింఛన్ రూ.3 వేలు తీసుకోవడం ఆనందంగా ఉంది. నాలాంటి వారికి ఈ పింఛన్ కానుక ఎంతో ఉపయోగపడుతుంది.

-పి.లక్ష్మి, సత్యనారాయణపురం

జగన్‌బాబుకు రుణపడి ఉంటాను



నా భర్త అనారోగ్యం కారణంగా నాలుగు నెలల క్రితం మృతి చెందారు. వితంతు పింఛను కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు చేశాను. నాలుగు నెలల్లో నాకు పింఛను మంజూరైంది. నేడు రూ.3 వేలు పింఛను ఎమ్మెల్యే చేతుల మీదుగా తీసుకున్నాను. ఏ నాయకుడి చుట్టూ తిరగకుండానే నాకు పింఛను ఇచ్చారు. జగన్‌బాబుకు రుణపడి ఉంటాను.

-శానాపతి పార్వతి, సైతారుపేట, ఎస్.రాయవరం మండలం

పేదల పాలిట వరం



టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.75 పింఛను అందిస్తే రాజశేఖరరెడ్డి దానిని రూ.250 వరకు పెంచారు. ఇప్పుడు ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 వేలు పింఛను అందిస్తున్నారు. వృద్ధుల కోసం మంచి ఆలోచన చేసిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమే. పింఛను పథకం పేదల పాలిట వరం.

-కె.ఎస్.రాజు, యలమంచిలి మిలట్రీ ఆర్ కాలనీ, యలమంచిలి

రెండు మాసాల్లోనే పింఛన్ లబ్ధి



రూ.వెయ్యి ఉన్న పింఛన్ రూ.3 వేలకు పెంచిన మహానుభావుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. దరఖాస్తు చేసిన రెండు నెలల్లోనే నాకు రూ.3 వేలు పింఛన్ మంజూరు చేశారు. వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే మాలాంటి వారికి పింఛన్ కొండంత భరోసా. ఒకరిపై ఆధారపడకుండా ఎంతో ఉపయోగపడుతున్నాయి.

- శొంట్యాన వెంకటసత్యనారాయణ, అక్కిరెడ్డివానిపాలెం

8 నాటికి శతశాతం పంపిణీ



జిల్లాలో గతేడాది వరకు రూ.2,750 చొప్పున పింఛన్ అందించాం. సీఎం జగన్ హామీ మేరకు ఈ ఏడాది రూ.250 పెంచి రూ.3 వేలు చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. పింఛన్ మొత్తం పెంపు కారణంగా 3వ తేదీ నుంచి పంపిణీ ప్రారంభించాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెల 8వ తేదీ నాటికి శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసేలా అన్ని చర్యలు చేపట్టాం.

-శచీదేవి, డీఆర్డీఏ పీడీ

సీఎం జగన్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- విలేకరులతో సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

కశింకోట: అనకాపల్లి జిల్లాను సాఫ్ట్‌వేర్ రంగంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐటీ పరిశ్రమ, డెయిరీ ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం తన లక్ష్యమన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో తన వంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటి వరకు వ్యాపార రంగంలో ఉన్న తాను ప్రజలకు సేవ చేయడానికి, తల్లిదండ్రుల రాజకీయ వారసత్వాన్ని కొనసాగించనున్నట్లు వెల్లడించారు. సమన్వయకర్తగా అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే సీఎంను కలిసి వచ్చి, నియోజకవర్గంలో ప్రచారాన్ని ప్రారంభిస్తానన్నారు. ఎంపీ తనయుడు డాక్టర్ కె.యశ్వంత్, పలువురు నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు భరత్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు మాజీ ఎంపీపీ మలసాల కాసులమ్మ(ధనమ్మ), విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో దివ్యాంగురాలికి పింఛన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

జగనన్న నిర్ణయమే శిరోధార్యం

- మహానేత ఆశీస్సులతో పేట అభివృద్ధికి కృషి
- పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు

నక్కపల్లి : మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో పాయకరావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. కొత్త సమన్వయకర్తగా బుధవారం ఆయన నక్కపల్లి వచ్చారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నియోజకవర్గ ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. పార్టీకార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులను వీసం రామకృష్ణ పరిచయం చేశారు.

ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అండదండలతో రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించినట్లు పేర్కొన్నారు. మూడోసారి పాయకరావుపేట నుంచి పోటీ చేయాలని జగనన్న తనను ఇక్కడకు పంపించారన్నారు. ఈ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెడతానని ధీమా వ్యక్తం చేశారు. పాయకరావుపేట నియోజకవర్గానికి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా ప్రస్తుత ఎమ్మెల్యే బాబూరావు, నియోకవర్గంలోని ముఖ్య నాయకుల సలహాలు, సూచనలతో కృషి చేస్తానన్నారు. త్వరలో అన్ని గ్రామాల్లో పర్యటించి, పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేస్తూ, జగనన్న అండగా నిలిచిన వారందరినీ కలుస్తానన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. దీనికి తానే నిదర్శనమన్నారు. అనంతరం ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయన గోత్రనామాలతో పూజలు నిర్వహించారు.

జోగులకు స్వాగతం పలికిన వారిలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసాల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పాపారావు, సర్పంచ్‌లు రత్నకుమారి, వెదుళ్ల రమణ, సాదిరెడ్డి శ్రీను, సురేష్ వర్మ, కొండలరావు, ఎం.శ్రీను, వెంకటేష్, ఎంపీటీసీలు తిరుపతిరావు, కొల్నాటి బుజ్జి, మాజీ సర్పంచ్ కల్పన, పార్టీ నాయకులు బలరామరాజు, అల్లాడ కొండ, ఎల్లేటి సత్తిబాబు తదితరులు ఉన్నారు.



నక్కపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కంబాల జోగులు

ముందే వచ్చిన సంక్రాంతి

- అనకాపల్లిలో టిడ్కో గృహాల పంపిణీ నేడు
- 2,744 మంది లబ్ధిదారులకు ప్రయోజనం

అనకాపల్లి: పేదవారి సొంతింటి కల నెరవేరుతోంది. అందరికీ ఇల్లు ఉండాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం సామాన్యులకు ఓ గూడు కల్పిస్తోంది. పట్టణాల్లో పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్ల పంపిణీకి సిద్ధమయ్యాయి. గురువారం లబ్ధిదారుల చేతికి అందనున్నాయి. మండలంలోని సత్యనారాయణపురం టిడ్కో గృహ సముదాయంలో గురువారం ఉదయం జరిగే కార్యక్రమంలో లబ్ధిదారులకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా గృహాలు పంపిణీ చేయనున్నారు. సత్యనారాయణపురంలో టిడ్కో ఇళ్లను అందుకుంటున్న 2,744 మంది పదిరోజులు ముందుగానే సంక్రాంతి పండగ వచ్చిందని సంబరపడుతున్నారు. వీరికి రూ.202.86 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. ఈ గృహాలను మూడు కేటగిరీలుగా విభజించారు. 300 చ.అడుగుల గృహాలకు గత ప్రభుత్వం రూ.2.65 లక్షల చొప్పున బ్యాంకు రుణాన్ని అందజేసింది. లబ్ధిదారు 20 సంవత్సరాల్లో కట్టవలసిన మొత్తం రూ.7.20 లక్షలు. అయితే ఈ ప్రభుత్వంలో ఆ గృహాలను కేవలం రూపాయి తీసుకొని ఇవ్వడంతో వారి ఆనందానికి అవధులు లేవు. 365 చ.అడుగుల ఇళ్లకు లబ్ధిదారుడు గతంలో రూ.50 వేలు చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు రూ.25 వేలు చెల్లిస్తే సరిపోతుంది. 430 చ.అడుగులు కలిగిన ఇల్లు పొందిన లబ్ధిదారుడు గత ప్రభుత్వంలో రూ.లక్ష తన వాటాగా చెల్లించాల్సి వచ్చేది.

కానీ ఇప్పుడు రూ.50 వేలు చెల్లించి ఇల్లు పొందవచ్చు. గత ప్రభుత్వంలో ఈ ఇళ్ల రిజిస్ట్రేషన్ ఖర్చులు లబ్ధిదారులు భరించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు రూ.75 వేల రిజిస్ట్రేషన్ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. సత్యనారాయణపురం టిడ్కో హౌసింగ్ కాలనీలో సురక్షితమైన మంచినీటి పథకాన్ని, విద్యుత్ సరఫరా, సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేసి లబ్ధిదారులకు నివాసయోగ్యమైన పరిస్థితులను ప్రభుత్వం కల్పించింది.



పంపిణీకి సిద్ధంగా ఉన్న టిడ్కో గృహ సముదాయం

ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ



అధికారులకు ఎన్నికల నిర్వహణలో శిక్షణ కల్పించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి.. ఎస్పీ మురళీకృష్ణతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ అన్నారు.

-8లో

క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- యలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు



ఉషోదయ ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

దేవరాపల్లి: పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని యలమంచిలి డివిజన్ డిప్యూటీ డీఈవో అప్పారావు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు ఉషోదయ హైస్కూల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలల్లో రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, బోధనపై ఆరా తీశారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎంఈవోలు బి.పడాల్‌దాస్, వి.ఉషారాణి, ఉషోదయ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ రాధ, ఉపాధ్యాయుడు వెంకటరమణ పాల్గొన్నారు.

హాస్టల్ బాలుర ఉదంతంపై నివేదిక కోరిన బాలల కమిషన్

చోడవరం రూరల్: నూతన సంవత్సర వేడుకల్లో స్థానిక బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు సమీపంలోని భవనంలో బీరు తాగిన ఉదంతంపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ నివేదిక కోరింది. ఈ మొత్తం వ్యవహారంపై సంపూర్ణ నివేదిక అందచేయాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించినట్టు కమిషన్ సభ్యుడు గొండు సీతారాం బుధవారం పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి సమయంలో బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం విద్యార్థులు స్థానికులతో కలిసి మద్యం సేవిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీనిపై బాలల కమిషన్ స్పందించింది.

నేటి నుంచి కథా నాటిక పోటీలు

సీతంపేట: అజోవిభో కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా ఈ నెల 4 నుంచి 7 వరకు కళాభారతిలో విశిష్ట పురస్కారాలు, సాహితీ సాంస్కృతిక సదస్సులు, కథా నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ వి.వి.రమణమూర్తి తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

రావికమతం: సారాతో గుడ్డిప గ్రామానికి చెందిన గల్లా కృష్ణంనాయుడు అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్టు రావికమతం ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. గుడ్డిపలో సారా విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు చెప్పారు. నిందితుడి నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మలసాలను గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలి



సమావేశంలో మలసాలను పరిచయం చేస్తున్న మంత్రి అమర్‌నాథ్



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా మలసాల భరత్‌కుమార్‌ను గెలిపించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన బుధవారం జరిగిన నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో నన్ను మీరు గుండెల్లో పెట్టుకున్నారు.. ఇక మీదట నేనెక్కడున్నా మిమ్మల్ని గుర్తు పెట్టుకున్నానని పేర్కొన్నారు. నా తండ్రి గుడివాడ గురునాథరావు దగ్గర నుంచి నా కుటుంబాన్ని మీరు గుర్తిస్తూనే వచ్చారని చెప్పారు. రేపు నా బిడ్డల్ని కూడా గుర్తించాలని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులను ఆయన కోరారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లను తిరుపతి తీసుకెళ్తానని హామీ ఇచ్చానని, వచ్చే నెలలో ఒక తేదీన నిర్ణయించి ఆరోజు సర్పంచ్‌లందరినీ తిరుమల శ్రీవారి దర్శనానికి తీసుకెళ్తానన్నారు. కొంతమంది వ్యక్తులు పార్టీ గుర్తించినా పార్టీ నుంచి బయటకు పోయారని, వారి విజ్ఞతకే వదిలివేసినట్టు చెప్పారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు శిరసా వహిస్తానన్నారు. పార్టీ జెండా పట్టుకొని కార్యకర్తలా తిరుగుతానని చెప్పారు. అంతకుముందు మలసాల భరత్‌కుమార్‌కు మంత్రి అమర్‌నాథ్ పార్టీ కండువా కప్పారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ ప్రస్తుతం భరత్ కుమార్‌ను ఎమ్మెల్యేగా నియోజకర్గ పార్టీ శ్రేణులు ఆశీర్వదించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ కొంతమంది నాయకుల వల్ల నియోజకవర్గంలో పార్టీ నేతలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. రెండురోజుల క్రితమే ఆ ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. గతంలో కులాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూసేవారన్నారు. భరత్‌కుమార్‌పై ఎవరు ఎటువంటి దుష్ప్రచారాలు చేసినా పార్టీ నేతలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ప్రతి కార్యకర్తను కలుపుకొని పనిచేస్తా : మలసాల

ప్రతి కార్యకర్తను గుర్తిస్తూ పని చేస్తానని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. దివంగత వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నియోజకవర్గ అభివృద్ధిపై చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలను కలుపుకొంటూ పార్టీ బలోపేతానికి పని చేస్తానని అన్నారు.

కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లిబాబు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు విష్ణుమూర్తి, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిశోర్, ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ(జోసెఫ్), జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, కశింకోట సర్పంచ్ కలగా లక్ష్మి, పలు ఆలయాల చైర్మన్లు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేసి విజయఢంకా మోగిద్దాం



కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు

- పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంబాల జోగులు

ఎస్.రాయవరం : వైఎస్సార్ శ్రేణులంతా కలిగికట్టుగా పనిచేస్తే 2024 ఎన్నికల్లో అధికారం సునాయాసంగా వస్తుందని పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన శ్రీకాకుళం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన ఆయన కొరుప్రోలు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు క్యాంపు కార్యాలయం వద్ద పలు మండలాల నాయకులతో సమావేశం అయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, ఉన్న కొద్ది రోజుల్లోనే నియోజకవర్గంలో అన్ని గ్రామాలు తిరిగి ప్రతి కార్యకర్తని కలుస్తామన్నారు. పార్టీ విజయానికి తనవంతు కృషి పూర్తి స్థాయిలో చేసి జగనన్న అప్పగించిన బాధ్యతలు నెరవేరుస్తానన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో తనకు అందించిన సహకారం ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన జోగులకు కూడా అందించాలన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష అని, అయితే ప్రతి ఒక్కరికి తెలిసేలా మరోమారు కార్యకర్తలు చెప్పాల్సిన అవసరం వచ్చిందన్నారు. ప్రజా సంక్షేమంతో పూర్తి స్థాయిలో రాష్ట్రాన్ని ఆదుకున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, మాతా గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు స్పీకర్ తమ్మినేని

- జీసీల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రావు



తమ్మినేనిని సత్కరిస్తున్న అఖిల భారత బీసీల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మోహనరావు

తాటిచెట్లపాలెం: నాలుగు దశాబ్దాలుగా రాష్ట్ర ప్రగతి, సంక్షోభ సమయాల్లో అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం నిర్వహించిన పాత్ర, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన తీరు నేటి సమాజంలో అందరికీ ఆదర్శప్రాయమని అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పల రామ్మోహన్‌రావు అన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో మాధవధారలోని మాధవస్వామి కల్యాణ మండపంలో శాసనసభా స్పీకర్ తమ్మినేనికి బుధవారం రాత్రి పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ తమ్మినేని సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని, సేవలను గుర్తిస్తూ సమాఖ్య, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం తరఫున సత్కరించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పాలన విధానాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తమ్మినేని నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, జీవీఎంసీ కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, ఏపీ చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ సీతారాం, మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న పనుల నిమిత్తం రద్దు చేసిన పలు రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం పునరుద్ధరిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

పునరుద్ధరించిన రైళ్లు

- విజయవాడ–విశాఖపట్నం–విజయవాడ(22702/22701) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5 నుంచి 13వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా రోజుల్లో నడుస్తుంది.
- గుంటూరు–విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం–గుంటూరు(172400 సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నడుస్తుంది.

సికింద్రాబాద్–బ్రహ్మపూర్ మధ్య మరో సంక్రాంతి స్పెషల్

పండగ వేళ సికింద్రాబాద్–బ్రహ్మపూర్–సికింద్రాబాద్ మధ్య మరో సంక్రాంతి స్పెషల్ రైలును నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం తెలిపారు. సికింద్రాబాద్–బ్రహ్మపూర్(07093) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 15 తేదీల్లో సికింద్రాబాద్‌లో రాత్రి 7.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 5.47 గంటలకు బయలుదేరి అదే రోజు ఉదయం 11.15 గంటలకు బ్రహ్మపూర్ వెళ్తుంది. బ్రహ్మపూర్–సికింద్రాబాద్(07094) స్పెషల్ రైలు ఈ నెల 9, 16వ తేదీల్లో బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 5.12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది.

కన్యాకుమారి–డిబ్రూఘడ్ రీ షెడ్యూల్

కన్యాకుమారిలో బుధవారం సాయంత్రం 5.25 గంటలకు బయలుదేరాల్సిన కన్యాకుమారి–డిబ్రూగఢ్(22503) ఎక్స్‌ప్రెస్.. లింక్ రైలు ఆలస్యం కారణంగా సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయలుదేరింది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు ఈ రైలు చేరుకోనుంది.

నేడు సంత్రగచ్చి వరకే అమరావతి ఎక్స్‌ప్రెస్

వాస్కోడగామాలో ఈ నెల 2వ తేదీన బయలుదేరిన వాస్కోడగామా–షాలిమర్(18048) అమరావతి ఎక్స్‌ప్రెస్ భద్రతా పనుల కారణంగా గురువారం సంత్రగచ్చి వరకే నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

తాండవ పరిసరాల్లో సినిమా షూటింగ్‌లకు అనుకూలం



క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నాతవరం : సినిమా షూటింగ్‌లకు తాండవ ప్రాజెక్టు, సరుగుడు సుందరకోట ప్రాంతాలు అనువుగా ఉంటాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నాతవరంలో బుధవారం యుట్యూబ్ చానల్ సినిమాకు ఆయన క్లాప్ కొట్టి ప్రారంభించారు. నాతవరం మండలం వల్సన్నపేట గ్రామానికి చెందిన డైరెక్టర్ ఉర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో కొత్త యుట్యూబ్ సినిమా షూటింగ్ పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతంతో పాటు మైదానప్రాంతంలో కూడా సినిమా షూటింగ్ సన్నివేశాలు చిత్రీకరించేందుకు అనేక ప్రాంతాలున్నాయన్నారు. ఇటీవల కాలంలో తాండవ రిజర్వాయర్, సరుగుడు, సుందరకోట ప్రాంతాల్లో అనేక సినిమాలు చిత్రీకరించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పార్టీ నేతలు ఇత్తంశెట్టి శ్రీనివాస్, మిడతాన రాం ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

- ఇమ్యూనైజేషన్ స్టేట్ ఆఫీసర్ డాక్టర్ దేవి



నర్సీపట్నం : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం అని రాష్ట్ర ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ దేవి తెలిపారు. మున్సిపాలిటీ పరిధి పెద బొడ్డేపల్లిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఇంటి ముంగింటకే వైద్య సేవలను తీసుకువెళ్లాలనే సంకల్పంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇంటింటి సర్వేలో రోగులను గుర్తించి, మొదట విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో నలుగురు స్పెషలిస్టులతో వారికి వైద్య సేవలు అందించామన్నారు. రెండో విడత శిబిరంలో వారందరికీ తిరిగి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నయమైందా లేదా అని పరిశీలిస్తామన్నారు. అపరేషన్‌లు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపించి వైద్య సేవలు అందిస్తామన్నారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తున్నామన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై సమగ్ర దర్యాప్తు

- జిల్లా అడిషనల్ పీడీ రోజారమణి



ప్రజావేదిక గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

రోలుగుంట: మండలంలో నిర్వహించిన ఉపాధి పనుల్లో బయటపడిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని జిల్లా అడిషనల్ పీడీ రోజారమణి తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల ఉపాధి నిధులతో 953 పనులు చేపట్టారు. ఈ పనులపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రజా వేదిక గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ పీడీ రోజారమణితో పాటు జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి పాల్గొన్నారు. పది రోజుల పాటు నిర్వహించిన సామాజిక తనిఖీలో పలు అవకతవకలు బయటపడినట్టు జిల్లా రిసోర్స్‌పర్సన్‌లు తెలిపారు. పలు గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు రహదారులకు ఇరువైపుల నాటిన మొక్కలు కనిపించ లేదని, వివరాలు తెలిపే బోర్డులు కూడా లేవన్నారు. బుచ్చెంపేట గ్రామంలో ఇల్లపు మణి అనే మహిళ ఉపాధి పనికి రాకపోయినా ఆమె పేరుతో మస్టరులో వేసి పేమెంట్ పెట్టారని వివరించారు. చాలా గ్రామాల్లో హౌసింగ్‌లో చేపట్టిన పనులకు ఎంబుక్‌లో నమోదు చేయకుండానే పేమెంట్లు పెట్టారని వివరించారు. ఈవోపీఆర్‌డీ నూకరాజు, ఏపీవో సూర్యమణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రశాంత నిర్వహణపై అధికారులకు శిక్షణ



సెక్టోరియల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. పట్టణంలోని పెంటకోట కన్వెన్షన్ హాలులో సెక్టోరియల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ వీరికి మెజిస్టీరియల్ అధికారాలు ఉంటాయన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీకి కూడా ప్రతినిధులుగా వీరు వ్యవహరిస్తారన్నారు. వల్నరబుల్ (దుర్బల) పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాల్సి ఉందన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతం ఎక్కువగా ఉండి, వాటిలో ఎక్కువ శాతం ఒకే అభ్యర్థికి ఓట్లు రావడం, ఓటర్లను బెదిరించడం, పోలింగ్‌లో పాల్గొనడానికి ఓటర్లే అనాసక్తి ప్రదర్శించడం తదితర పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించాలన్నారు. అలాంటి పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అధికారులు పీవోలు, ఏపీవోలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు 16 మంది నోడల్ అధికారులు ఉంటారన్నారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రశాంత, నిష్పక్షపాత ఓటింగ్ జరిగేలా సెక్టోరియల్ అధికారులు ముందస్తు ప్రణాళికలతో పరిస్థితుల్ని చక్కదిద్దాలన్నారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలను గుర్తించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను అనుసరిస్తూ ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ సెక్టోరియల్ అధికారుల విధులు, నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఈఆర్‌వోలు, ఆర్డీవోలు, ఎస్‌డీసీలు, ఏఈఆర్‌వో, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేయాలి

జిల్లాలో పోలింగ్ కేంద్రాల పరిస్థితిని తనిఖీ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఇప్పటివరకు అందిన మార్పులు చేర్పులు తొలగింపులు దాదాపు పూర్తయ్యాయన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్తు, మరమ్మతులు, తాగునీరు, వికలాంగులకు ర్యాంపు మొదలైన ఏర్పాట్లు పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రేపటి నుండి వల్నరలబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, ఎస్‌వీవీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పది గ్రామాల్లో రూ.10.27 కోట్లతో అభివృద్ధి పనులు



కె.జె.పురం-కెనాల్ మార్గం మధ్య నిర్మించిన తారు రోడ్డు

- నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కొరువాడలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయ భవనం



లంకవానిపాలెంలో నిర్మాణం జరిపిన సిమెంట్ రోడ్డు

కె.కోటపాడు : మండలంలో పది గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు పూర్తి కావడంతో వీటి ప్రారంభోత్సవాన్ని ఘనంగా జరిపేందుకు ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో బుధవారం కొరువాడ, లంకవానిపాలెం, శృంగవరం, పిండ్రంగి, గవరపాలెం, కె.జె.పురం, కె.అగ్రహారం, సూర్రెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం, దాలివలస గ్రామాల్లో రూ.10.27 కోట్లతో జరిగిన 20 అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ప్రారంభోత్సవం జరపనున్నారు.

ప్రాధాన్యతా భవనాల పూర్తి

మండలంలో కొరువాడ, కె.జె.పురం, సింగన్నదొరపాలెం గ్రామాల్లో గ్రామ సచివాలయ భవనాలు నిర్మించారు. ఒక్కో సచివాలయం భవనానికి రూ.43.60 లక్షలు వెచ్చించారు. కొరువాడలో రూ.25 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించనున్నారు. లంకవానిపాలెం, పిండ్రంగి, కె.అగ్రహారం, సూర్రెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం, దాలివలస గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న సిమెంట్ రోడ్లను కూడా డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారు.

నాడు మట్టిరోడ్లు...నేడు తారురోడ్లు

మండలంలో పలు గ్రామాల్లో గతంలో మట్టి రోడ్లుగా ఉన్న మార్గాలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తారురోడ్లుగా మార్చేందుకు కోట్లాది రూపాయలు మంజూరు చేశారు. మండలంలో పిండ్రంగి–కొత్త భూమి రోడ్డును రూ.2 కోట్లు, పిండ్రంగి–డి.అగ్రహారం రోడ్డును రూ.63 లక్షలు, గవరపాలెం–కొరువాడ రోడ్డును రూ. కోటి, కె.జె.పురం రోడ్డు నుంచి రైవాడ కెనాల్ మార్గం వరకూ తారురోడ్ల నిర్మాణానికి రూ.కోటి 10లక్షలు, సింగన్నదొరపాలెం–దాలివలస వరకూ రూ.80లక్షలతో తారురోడ్లుగా అభివృద్ధి చేశారు.

మా గ్రామంలో అభివృద్ధి వెలుగులు



సీఎం జగన్ పాలనలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సంపూర్ణ సహకారంతో మా గ్రామంలో అభివృద్ధి వెలుగులు నిండాయి. రూ.43 లక్షలతో సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ రూ.20.80 లక్షలతో నిర్మాణం జరిగాయి. వీటితో పాటు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రైవాడ కెనాల్ మార్గం వరకూ రూ.కోటి 10 లక్షలతో తారురోడ్ల నిర్మాణం జరిపారు. గ్రామంలో ఇంటర్నల్ సీసీ రోడ్లు పూర్తి చేశారు. సీఎం జగన్, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు మా గ్రామస్తులంతా రుణపడి ఉంటాం.

–చీపురుపల్లి గోవింద, కొరువాడ జగన్నాథపురం

జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామీణ ప్రజలకు శ్రీరామరక్ష

అనారోగ్యంతో పేదల బతుకులు మరింత దుర్భరం కారాదు. తీవ్ర వ్యాధుల్ని కూడా ముందస్తుగా గుర్తించగలిగితే స్వల్ప చికిత్సలతో బయటపడవచ్చు. ప్రాణాపాయం తప్పించి, ఓ కుటుంబాన్ని నిలబెట్టవచ్చు. అందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసింది. తొలి విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇపుడు రెట్టింపు ఉత్సాహంతో రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మొదలయ్యాయి.

ఘనంగా మొదలైన రెండో విడత సురక్ష శిబిరాలు

స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య సేవల పట్ల ప్రజల హర్షం

అనకాపల్లి: విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత నిస్తూ తమ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలని ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. స్థానిక సచివాలయం -1 గాంధీనగరం ఎలిమెంటరీ స్కూల్లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన ప్రారంభమైన ఈ శిబిరంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడతలో వివిధ రకాలైన వ్యాధులతో బాధపడే రోగులకు, వారి గ్రామాల్లోనే వైద్యులు వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. రెండో విడత శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి శిబిరంలో ఒక ఫ్యామిలీ డాక్టర్, ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులతోపాటు ఓ కంటి వైద్యుడు రోగులను పరీక్షించి, వైద్యం అందిస్తారన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసి, ఉచితంగా చికిత్స చేయనున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పేదలు అనారోగ్యం బారిన పడితే కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స కోసం టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదని ఆక్షేపించారు. తమ ప్రభుత్వంలో ప్రజల వద్దకే వైద్యసేవలను చేర్చినట్లు తెలిపారు. అనంతరం ఆయన రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, జెడ్పీ సుర వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు జి.రామ్మూర్తి, మూనూరు శ్రీనువాసరావు, వైద్యాలయం ఆర్ఎంవో లక్ష్మణ్‌శ్రీనివాస్, పార్టీ నేతలు కె.రవీంద్రనాథ్, ఆకుల సంతోష్, ఆలుమళ్ల జయరామ్, ఏడువాకల నూకమ్మ, మెలిపాక దుర్గ, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


శిబిరంలో రోగితో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్


మందుల కౌంటర్ వద్ద వైద్యసిబ్బంది, రోగులు


రోగికి మందులు అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్


రోగికి బీపీ చెక్ చేస్తున్న సిబ్బంది


వైద్యశిబిరంలో రోగి సమస్యను తెలుసుకుంటున్న వైద్యుడు లక్ష్మణశ్రీనివాస్

రెండు మాసాలుగా కంటి సమస్య



రెండు మాసాలుగా కంటి చూపు మందగిస్తోంది. ఎన్టీఆర్ వైద్యాలయంలో కంటి వైద్యులను కలిసి చూపించుకోవాలని అనుకున్నాను. నా సమస్యను వలంటీర్‌కు చెప్పగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సచివాలయం పరిధిలో నిర్వహిస్తారని చెప్పారు. సురక్ష క్యాంపులో కంటి పరీక్షలు చేయించుకున్నా. కంటి అద్దాలు రాసిచ్చారు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు చెప్పారు. మాలాంటి వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ బాగుంది.

– షేక్‌షాబీ, అంజయ్యకాలనీ, అనకాపల్లి

కీళ్ల నొప్పితో నరకం



గత కొంత కాలంగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యులను సంప్రదించా. వయసును బట్టి కీళ్ల సమస్యలు వస్తాయని, పౌష్టికాహారం, నిత్యం పాలు తీసుకోవాలన్నారు. అవసరమైన మందుల్ని ఉచితంగానే ఇచ్చారు. అక్కడే బీపీ, సుగర్, రక్త పరీక్షలు చేశారు. ఏ ప్రభుత్వంలోను ఇలా ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచించి, వైద్య సేవలందించడం చూడలేదు. ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందించడం గొప్ప విషయం.

– ఎ.రమణ, అంజయ్యకాలనీ, అనకాపల్లి

క్లుప్తంగా

వృద్ధులకు గుర్తింపు కార్డులు

అనకాపల్లి: స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో బుధవారం వయోవృద్ధుల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు, సంఘ సేవకులు కేవీ గౌరీపతి వృద్ధ దంపతులను సత్కరించి, గుర్తింపు కార్డులు అందించారు. కార్యక్రమంలో వయోవృద్ధులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గజ్జాలు

కశింకోట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా బయ్యవరం గ్రామానికి చెందిన సనేడ గజ్జాలు నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని గజ్జాలు తెలిపారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన


నెహ్రూచౌక్ ధర్నాలో అంగన్‌వాడీలు, సీఐటీయూ, సీపీఐ నాయకులు

అనకాపల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని 23 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నట్లు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి దాకారపు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో రహదారులను దిగ్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు, సీఐటీయూ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 5,437 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,000	4,900
మొదటి రకం	3,820	4,670
రెండో రకం	3,730	4,300
మూడోరకం	3,400	3,720

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	: రాజా
పిండం (మధ్యాహ్నం, రెండో ఆట) వెంకీ (మ్రార్నింగ్, సాయంత్రం ఆట)	: సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ)	: సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	: షిర్డిసాయి
సలార్	: పర్తిసాయి
మంగళవారం	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
సలార్	: రామచంద్ర

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

అనకాపల్లి: అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ తమ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. నియోజకవర్గంలోని కొత్తూరు గ్రామం దేవీనగర్ దొంగ గెడ్డపై రూ.17.50 లక్షలతో నిర్మించిన కల్వర్టు, పట్టణ పరిధిలో మళ్ల భాస్కరరావు వీధిలో రూ.18.50 లక్షలతో నిర్మించిన కల్వర్టు, కొత్తూరు గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ డ్రైనేజీ పనులను ఎంపీ సత్యవతితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. జాతీయ రహదారికి అనుసంధానంగా గ్రామీణ ప్రాంతాల రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, సర్పంచ్ సప్పరపు లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు దేవీనగర్ బ్రిడ్జి శిలాఫలకాన్ని ప్రారంభించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి

సీఆర్పీలకు శిక్షణ

కశింకోట: గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలను లక్షాధికారులను చేసి, వారి కుటుంబాల అభ్యున్నతికి అనుసరించాల్సిన మార్గాలపై సీఆర్‌పీలకు బుధవారం శిక్షణ నిర్వహించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని స్వయం సహాయక సంఘాల సీఆర్‌పీలకు వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు పలు అంశాలపై మెలకువలను వివరించారు. స్త్రీనిధి మేనేజర్ వెంకటరమణ, ఎల్‌సీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సీఆర్‌పీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి


హెచ్‌ఎంను సత్కరిస్తున్నసంస్థ సభ్యులు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో అబ్దుల్‌కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. జిల్లా ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చిన్నియాదవ్ సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు హెచ్‌ఎం సంధ్యారాణిని సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గౌరీ సేవా సంఘం అధ్యక్షుడిగా కర్రి

అనకాపల్లి: గౌరీ సేవా సంఘం అధ్యక్షుడిగా కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శిగా బొడ్డేడ రామ సత్యనారాయణలు ఎన్నికయ్యారు. స్థానిక గౌరీ పంచాయతన దేవాలయంలో బుధవారం కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ కల్యాణ మండపం, మళ్ల జగన్నాథ్ కల్యాణ మండప పునర్నిర్మాణ కమిటీ ఎన్నిక జరిగింది. కోశాధికారిగా శరగడం జగదీష్‌తోపాటు మరో 22 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు.

వెంకన్న సన్నిధిలో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి, గోవిందరావులు ఆలయ మర్యాదలతో ఆయనకు సాదర స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. అంతకుముందు వేదపండితులు పులఖండం గిరిబాబు, విజయబాబులు మంత్రి అమర్‌నాథ్‌ను ఆశీర్వదించగా, రాజ్యలక్ష్మి, గోవిందరావులు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, ఆలయాల చైర్మన్‌లు కొణతాల మురళీకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, కె.ఎం.నాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ నేతలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి, గోవిందరావు దంపతులు

ఘనంగా కనకమహాలక్ష్మి సారె ఊరేగింపు

కశింకోట: స్థానికంగా ప్రసిద్ధి చెందిన కనక మహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మహిళలు తయారు చేసిన వంటకాలు, పండ్లు వగైరా పళ్లేల్లో తెచ్చి అమ్మవారికి నివేదించి, పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై నిలిపి సారె ఊరేగించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు సంతబయలు, పూసర్లవీధి, కస్పావీధి, పెద బజారు, గవరపేట మధ్య వీధి మీదుగా ఆలయం వరకు సాగింది.


అమ్మ వారి సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

సీఎం జగన్‌తోనే రాష్ట్రం అభివృద్ధి


జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సునీత

అనకాపల్లి: రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. 41వ సచివాలయంలో మాజీ కౌన్సిలర్, పార్టీ నాయకుడు దాడి భోగలింగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వల్లే తాను కార్పొరేటర్‌గా గెలిచినట్లు తెలిపారు. ప్రస్తుత వార్డు సమస్యల పరిష్కారంతోపాటు, ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధికి ప్రభుత్వానికి రుణపడి ఉంటానన్నారు. ఇప్పటికే వార్డులో రూ.17.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అంతకు ముందు సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. బ్రోచర్లను పంపిణీ చేశారు. పార్టీ జెండా ఎగురవేసి రచ్చబండ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, ఆలయ చైర్మన్‌లు కొణతాల మురళీకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పలకా సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి గ్రైపూరి రాజు, ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు మునూరు శ్రీను, పార్టీ నేతలు కర్రి భాస్కరరావు, మళ్ల స్వామి, బొడ్డేడ శివకృష్ణ, మళ్ల బలరాం, డేనియల్, డొంక సత్తిబాబు, కోన ఉమ, పేలూరి కల్యాణ్ పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 372 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 350 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (0892 4223595)ని సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-27 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.